క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, ఖానాపురం, నెక్కొండ, సంగెం, రాయపర్తి, ఇతర మండలాల్లో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలను నెక్కొండలో తహసీల్దార్ వెంకన్న, ఖానాపురంలో నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి పర్యవేక్షించారు. మొదటి రోజు నర్సంపేటలో 101 మంది, నెక్కొండలో 9 మంది, సంగెంలో ఐదుగురు, ఖానాపురంలో 9 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

పల్లెల్లో జాజిరి సందడి



చెన్నారావుపేట : మండలంలోని పల్లెల్లో జాజిరి సందడి నెలకొంది. 'జాజిరి జాజిరి జాజిరిజా.. వీరన్న బల్లికోడె..' అంటూ చిన్నారులు సందడి చేయడం మొదలైంది. హోలీ పండుగను పురస్కరించుకొని 9 రోజుల పాటు గ్రామాల్లో జాజిరి ఆటల సందడి ఆనవాయితీగా వస్తోంది. బుధవారం జాజిరి సందడి ఆకట్టుకుంది.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని బానోజీపేట జెడ్పీ సెకండరీ స్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి విరమణ పొందిన వెంకటేశ్వర ప్రసాద్‌ను సతీసమేతంగా ఉపాధ్యాయులు బుధవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ కొర్ర సారయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా వెంకటేశ్వర ప్రసాద్ దశాబ్దాల పాటు ఎనలేని సేవలు అందించారని అభినందించారు. అనేక మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రామనర్సయ్య, డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార్ల రవీందర్, కూనమల్ల కొమ్మాలు, మండల అధ్యక్షుడు సర్దార్, యూటీఎఫ్ బాధ్యుడు వెంకటేశ్వర్‌రావు, పీఆర్‌టీయూ బాధ్యుడు మల్లయ్య, ఉపాధ్యాయులు గండి లింగయ్య, సురేందర్, కొర్ర రమేశ్, గోపాల్ రావు, బుచ్చిరాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగుర్ల వెంకటేశ్వర్‌రావుకు..



సంగెం : జిల్లా ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికైన సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో నాగుర్ల వెంకటేశ్వర్‌రావును అసోసియేషన్ మండల ప్రతినిధులు బుధవారం శాలువాతో సన్మానించారు. తొలుత వెంకటేశ్వర్‌రావును నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు పొన్నర్సు బ్రహ్మయ్య, జిల్లా కమిటీ ప్రతినిధులు రామచంద్రారెడ్డి, రాజేందర్‌రెడ్డి, గజ్జెల శ్రీనివాస్, హింగే కిషన్‌రావు, నాయకులు తారక్‌రాంరెడ్డి, నరేశ్, కుమారస్వామి, గోపాల్, కిషన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపుల సీజ్



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామంలోని ఇసుక డంపులను బుధవారం సీజ్ చేసి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆకేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేసినా, నిల్వ చేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గీత కార్మికుడికి గాయాలు

దుగ్గొండి : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని పొనకల్‌లో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు బండి వెంకటయ్య కులవృత్తిలో భాగంగా కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కిన క్రమంలో ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడ్డాడు. దీంతో వెంకటయ్య కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక గీత కార్మికులు గమనించి ఆయన్ను చికిత్స కోసం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు.

'సీఎం బ్రేక్‌ఫాస్ట్' చెల్లింపులో నిర్లక్ష్యం

● ఆర్నెళ్ల బిల్లులు పెండింగ్

నల్లబెల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల వంట ఏజెన్సీ నిర్వాహకులకు 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందించిన వంట ఏజెన్సీ నిర్వహకులకు ఆర్నెళ్ల బిల్లులు రావాల్సి ఉండగా వారు 9 నెలలుగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టులో సదరు పథకం అమలుకు తిలోదకాలిచ్చిన విషయం తెలిసిందే. కాగా నాటికే పలు పాఠశాలల్లో విద్యార్థులకు అందించిన బ్రేక్‌ఫాస్ట్‌కు సంబంధించిన ఆర్నెళ్ల బిల్లులు నిర్వాహకులకు చెల్లించాల్సి ఉంది. నేటికీ బిల్లులు అందలేదు. కొంత ఆదాయం లభిస్తుందన్న ఆశతో ప్రభుత్వ ఆదేశాలతో అప్పు చేసి బ్రేక్‌ఫాస్ట్ అందించగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులకు వడ్డీ చెల్లించలేక మానసిక వేదనకు గురౌతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు.

6 పాఠశాలలు.. 308 మంది విద్యార్థులు

మండలంలోని నల్లబెల్లి, రేలకుంట, ముచ్చింపుల, ముచ్చింపుల తండా, నందిగామ ప్రాథమిక పాఠశాలలతోపాటు నందిగామ హైస్కూల్‌లో చదువుకుంటున్న 308 మంది విద్యార్థులు ఏజెన్సీ నిర్వాహకులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ అందించారు. పథకం ప్రారంభమైన మొదటి మూడు నెలల బిల్లులను నాటి ప్రభుత్వం చెల్లించింది. అనంతరం గతేడాది జనవరి నుంచి జులై వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. బిల్లుల కోసం అధికారులకు మొరపెట్టుకున్నా కనికరించడంలేదని ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు రాకపోవడంతో అప్పులకు వడ్డీ కూడా చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని నిర్వాహకులు తెలిపారు.



బ్రేక్‌ఫాస్ట్ తయారు చేస్తున్న నిర్వాహకురాలు (ఫైల్)

వెంటనే బిల్లులు చెల్లించాలి



పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి. అప్పులు చేసి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందించాం. ప్రభుత్వం బిల్లుల చెల్లింపును నిర్లక్ష్యం చేస్తోంది. ఆర్నెళ్ల బిల్లులు రాకపోవడంతో 9 నెలలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు చొరవ తీసుకుని వెంటనే బిల్లులు ఇప్పించాలి.

– పులి రజిత, నిర్వాహకురాలు, నల్లబెల్లి

బిల్లుల చెల్లింపునకు కృషి



'సీఎం బ్రేక్‌ఫాస్ట్' బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తా. పలు పాఠశాలల్లో విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ అందించారు. రికార్డులను పరిశీలించి బిల్లుల చెల్లింపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. తద్వారా ఏజెన్సీ నిర్వాహకులకు పెండింగ్ బిల్లులు అందేలా చొరవ తీసుకుంటా.

– వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఎంఈఓ

మహిళా సాధికారతతోనే సమాజ ఉన్నతి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భారతి

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్

నర్సంపేట : మహిళా సాధికారతతోనే సమాజ ఉన్నతి సాధ్యమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కస్తూరిబాయి మహిళా మండలి, కళాశాల మహిళా సాధికారత కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు పురుషులకు దీటుగా ఎదగాలని సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ భారతి మాట్లాడుతూ అత్యధిక మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. మహిళలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే కుటుంబానికి, సమాజానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కిశోర బాలికలు శారీరకంగా, మానసికంగా ఎదిగేలా చైతన్యవంతం కావాలని చెప్పారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ మధురిమ మాట్లాడుతూ మహిళలు హక్కుల సాధన కోసం పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుర్రపు అరుణ, నల్ల భారతి, కళాశాల మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రజిత, పాకాల మహిళా బ్యాంకు అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు జయప్రద, సరళ, అన్నపూర్ణ, ఉమాదేవి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరు.. సభ వెలవెల



సభలో మాట్లాడుతున్న ఈఓ సదానందం

నెక్కొండ : స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన గ్రామ సభ అధికారుల గైర్హాజరుతో వెలవెలబోయింది. సభకు గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ రాజ్‌కుమార్ సహా ఇతర శాఖల అధికారులూ హాజరు కాలేదు. కేవలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కార్యాలయ ఉద్యోగి శ్రీలతతోపాటు ఈఓ సదానందం సభను నిర్వహించారు. సభలకు గైర్హాజరవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గతంలో నిర్వహించిన సభలో తీర్మానం చేసినా అమలుకు నోచుకోకపోవడంతో నిర్లక్ష్యం తారాస్థాయికి చేరిందని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవి ప్రారంభ వేళలోనే తాగునీట సమస్య తలెత్తుతోందని, అవసరం మేరకు నీరు అందడం లేదని గ్రామస్తులు సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఈఓ సదానందం మాట్లాడారు. ప్రజలకు సరిపడా తాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు.

సామాజిక సేవలే 'ఎస్ఆర్ఆర్' ధ్యేయం

● బీఆర్ఎస్ నేత, ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



క్రీడా సామగ్రి అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : సామాజిక సేవలే ధ్యేయంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్‌ను స్థాపించినట్టు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొండూరుకు చెందిన ముస్లిమ్ యువతకు బుధవారం ఆయన క్రీడాసామగ్రి అందజేశారు. అనంతరం విద్యానగర్ తండాలో జాటోతు అనిల్ అనే యువకుడు కొనుగోలు చేసుకుని హార్వెస్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తానని చెప్పారు. యువత క్రీడల్లో, స్వయం ఉపాధిలో ఆసక్తి చూపాలని సూచించారు. తద్వారా సమాజాభివృద్ధిలో యువజనం భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. పేదలు ఫౌండేషన్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ నాయక్, ఫౌండేషన్ ప్రతినిధులు పూస మధు, లేతాకుల రంగారెడ్డి, కర్ర రవీందర్‌రెడ్డి, తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, నంది దేవేందర్‌రెడ్డి, యాసుఫ్, గజవెల్లి ప్రసాద్, రాము, గబ్బెట యాకయ్య, నేతావత్ శ్రీధర్, దేశబోయిన ఉపేందర్, శాస్త్ర బోయిన యాకయ్య, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని కమ్మపల్లిలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను మరిపించేలా తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. హెచ్ఎంగా శ్రీజ, పీఈటీగా అశ్విత, ఉపాధ్యాయులుగా లక్ష్మీప్రసన్న, మానస, సంజన, చరణ్య, దీక్షిత, అక్షయ, లికిత, అటెండర్‌గా నవీన్ వ్యవహరించి అలరించారు. న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు శోధర్, సరళాదేవి, లీనా వ్యవహరించగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం భిక్షపతి బహుమతులు అందజేసి అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెన్నారావుపేట : మండలంలోని బోడ మాణిక్యం తండాకు చెందిన భూక్య వినోద, బోడ తుల్సియాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సు నాయక్ బుధవారం పంపిణీ చేశారు. అనంతరం నర్సునాయక్ మాట్లాడారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు వీరన్న నాయక్, నాయకులు కీమానాయక్, భూక్య దంజ్యా, భూక్య సుమన్, భోజ్యా, రూప్‌సింగ్, రాజు, దేవ్‌సింగ్, వాలునాయక్, రవీందర్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల అందజేత



పర్వతగిరి : మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో 6 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయురాలు చందా శోభారాణి రమేశ్ దంపతులు బుధవారం రూ.80 వేల విలువైన బ్యాగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ లింగారెడ్డి హాజరై మాట్లాడారు. శోభారాణి రమేశ్ దంపతులను అభినందించారు. అనంతరం హెచ్ఎం రమేశ్‌బాబు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తోడ్పాటు అందించేందుకు ఉపాధ్యాయులు, సంపన్నులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు మనోహర్, డాక్టర్ భాస్కర్, రాధా కృష్ణకుమారి, తిరుమల, పరశురాములు, అనిల్‌కుమార్, రాజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత రిమాండ్

ఖానాపురం : బైండోవర్‌ను ఉల్లంఘించిన నాటుసారా విక్రేతను రిమాండ్‌కు తరలించినట్టు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. ఆయన మీడియాకు బుధవారం వివరాలు వెల్లడించారు. మండలంలోని నాజీతండాకు చెందిన అజ్మీర విజయ గతంలో నాటుసారాతో పట్టుబడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఆమె బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి మరోసారి నాటుసారాతో పట్టుబడడంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్ ఎదుట హాజరుపర్చగా జైలుశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. సదరు మహిళను నర్సంపేట జైలుకు తరలించినట్లు వివరించారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పల్లకొండ లాలు ప్రసాద్ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన ఉద్యోగ వ్యాపార, వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపకుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో గ్రూప్ సభ్యులు బుధవారం రూ.30 వేల సాయం అందజేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. యువత ఎంతటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని చెప్పారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రుద్ర రాజు, పల్లకొండ ప్రశాంత్, రవి, పులిచేరు మహేశ్, సదయ్య, రవీందర్, బాబు, రాములు, నర్సయ్య, స్వామి, సతీశ్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యం

పర్వతగిరి : వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని బోర్లు అన్ని పని చేసేలా చూడాలని చెప్పారు. చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించాలని తెలిపారు. అవసరమైతే వ్యవసాయ బావులు అద్దెకు తీసుకొని ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని తెలిపారు. అలాగే నర్సరీల్లో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని, అన్ని బ్యాగుల్లోనూ నారు లేదా విత్తనాలు ఉండాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు యాకూబ్‌నాయక్, సదానందం, రఘు, అశోక్, మోయిన్, సుమన్, సరిత, రమాదేవి, దివ్య, చైతన్య, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

'లోవోల్టేజీ' లేకుండా విద్యుత్ సరఫరా



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

నర్సంపేట : వ్యవసాయానికి లోవోల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని ఆ శాఖ వరంగల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) గౌతమ్ రెడ్డి తెలిపారు. మండలంలోని 33/11 కేవీ నాగుర్లపల్లి ఉపవిద్యుత కేంద్రంలో 5 ఎంవీఏ అదనపు విద్యుత్ నియంత్రికను అధికారులు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ గౌతమ్ రెడ్డి మాట్లాడారు. వ్యవసాయ వినియోగదారులు లోవోల్టేజి సమస్యతో ఇబ్బంది పడకుండా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. డివిజన్ పరిధిలో కాలిపోయిన విద్యుత్ నియంత్రికలను మార్చేందుకు 3 ఎంటీ ట్రాన్స్‌పోర్ట్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. నర్సంపేట టౌన్ సెక్షన్ పరిధిలో 100 కేవీఏ డీటీఆర్ చార్జ్ చేశామన్నారు. కార్యక్రమంలో డీఈ (ఎంఆర్‌డీ) హర్షి, నర్సంపేట డీఈ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే 'పొలంబాట' లక్ష్యం

● డీఈలు ఆనందం, భిక్షపతి



రైతులతో మాట్లాడుతున్న డీఈలు

వర్ధన్నపేట : వ్యవసాయ క్షేత్రాల్లో నెలకొనే విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'పొలం బాట' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ డీఈలు ఆనందం, భిక్షపతి తెలిపారు. మండలంలోని టేకులతండాలో ఏడీఈ నటరాజ్‌తో కలిసి వారు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వంగిపోయిన విద్యుత్ స్తంబాలను, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ సమస్య తలెత్తితే రైతులు సొంతంగా మరమ్మతులు చేపట్టవద్దన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే సత్వరమే పరిష్కరిస్తారని చెప్పారు. రైతులు విద్యుత్ పంపు సెట్లకు తప్పనిసరిగా కెపాసిటరు బిగించుకువాలని సూచించారు. తద్వారా మోటార్లకు రక్షణ లభించడంతోపాటు విద్యుత్ వినియోగంలో ఉపయోగం ఉంటుందన్నారు. ప్రమాదాల నివారణకూ అవకాశం ఉంటుందని వివరించారు.

'ఆకేరు' పాపం బీఆర్ఎస్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మాని శేఖర్‌రావు

● కాంగ్రెస్ అధికార ప్రతినిధి శేఖర్‌రావు

వర్ధన్నపేట : ఆకేరు వాగులో నీరు అడుగంటిపోవడానికి కారణం గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు అన్నారు. పట్టణంలోని ఎంఎంఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఎర్రబెల్లి దయాకర్‌రావు వర్ధన్నపేటపై సవతి తల్లి ప్రేమ చూపించాడని విమర్శించారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు ఆయనను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించినా చేసిందేమీ లేదన్నారు. ఆకేరు వాగుపై ఉన్న చెక్ డ్యాంలను పట్టించుకోకపోవడంతో నీరు దిగువకు వెళ్లిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు చేపట్టగా నీరు బయటకు పోకుండా ఆగినట్టు తెలిపారు. ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక చొరవ తీసుకుని ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీరు పొలాలకు అందిస్తున్నారని తెలిపారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి రైతుల వద్దకు వెళ్లి మొసలి కన్నీరు కార్చడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మైస సురేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు సమ్మెట సుధీర్, మహేశ్, జాటోత్ శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, పోశాల వెంకన్న, సిలువేరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

● కాంగ్రెస్ అధికార ప్రతినిధి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

సంగెం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని శ్రేణులకు ఆ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేశ్ గౌడ్ కోరారు. మండలంలోని షాపూర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసంక్షేమానికి అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. షాపూర్‌ను మోడల్ విలేజ్‌గా ఎంపిక చేశారని, నాలుగేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఒకే విడతలో అమలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు మెట్టుపల్లి రమేశ్, మడత కేశవులు, సొసైటీ చైర్మన్ దొమ్మాటి సంపత్, నాయకులు గుమ్మడి హరిబాబు, కిశోర్, జగన్నాథచారి, నరహరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామానంద్

నర్సంపేట : వేసవి ప్రారంభం అయిన క్రమంలో బాటసారుల దాహార్తిని తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద ఫ్రెండ్స్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణానికి పలు మండలాలు, ఇతర ప్రాంతాల నుంచి రైతులు, వ్యాపారాస్తులు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు రాకపోకలు సాగించడం పరిపాటి అని చెప్పారు. ఈ క్రమంలో వేసవిలో బాటసారులు, వ్యక్తిగత పనులపై పట్టణానికి వచ్చే ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటుకు సామాజిక సేవాభావం కలిగిన సంస్థలు, వ్యక్తులు ముందుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు భరత్ రెడ్డి, ఓర్సు వెంకన్న, బిట్ల మనోహర్, ఫ్రెండ్స్ ట్రావెల్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

ఖమ్మం క్రైం : రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన ఖమ్మం ఎఫ్‌సీఐ బైపాస్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్‌కు చెందిన నంగనూరి సిద్ధు (17) స్నేహితుడు సంతోశ్‌ను కలిసేందుకు బుధవారం ఖమ్మం వచ్చాడు. ద్విచక్ర వాహనంపై సంతోశ్, మరో స్నేహితుడితో కలిసి సిద్ధు వెళ్తుండగా బైపాస్ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన సిద్ధు అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
కె. రమేష్ (S.R) : 9441304664 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944